# శ్రీమతి తక్కెళ్ల సదాలక్ష్మి

శ్రీమతి తక్కెళ్ల సదాలక్ష్మి రెండవ శాసనసభ (1955-1962) డెప్యూటీ స్పీకర్‌గా 1960, మార్చి 15న ఏకగ్రీవంగా ఎన్నికై 1962, మార్చి 1 వరకు ఆ పదవిని నిర్వహించారు.

వీరు సికింద్రాబాదులోని బొల్లారంలో శ్రీ కొండయ్య, శ్రీమతి గోపమ్మ దంపతులకు జన్మించారు. సికింద్రాబాదు కీస్ ఉన్నత పాఠశాలలో చదివిన అనంతరము మద్రాసు క్వీన్ మేరీస్ ఉమెన్స్ కళాశాలలో చదివినారు. డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ గారి ఉపన్యాసం విని రాజకీయ రంగంలో ప్రవేశించారు.

శ్రీమతి సదాలక్ష్మి 1957వ సంవత్సరంలో జరిగిన ఎన్నికలలో రాష్ట్ర శాసన సభకు నిజామాబాద్ జిల్లా, కామారెడ్డి రిజర్వుడు నియోజకవర్గం నుండి శాసన సభ్యురాలుగా ఎన్నికైనారు. వీరు శాసనసభ డెప్యూటీ స్పీకర్‌గా తన వాక్‌చాతుర్యంతో, ప్రతిభతో ఆ పదవిని సమర్థవంతంగా నిర్వహించారు. మరియు డెప్యూటి స్పీకర్ హోదాలో 1959-1960, 1960-61 సంవత్సరములలో అర్జీల కమిటీ అధ్యక్షులుగా ఉన్నారు.

వీరు 1962వ సంవత్సరములో నిజామాబాద్ జిల్లా ఎల్లారెడ్డి రిజర్వుడు నియోజకవర్గం నుండి రెండవసారి శాసనసభకు ఎన్నికై డాక్టర్ నీలం సంజీవరెడ్డి మంత్రి వర్గంలో దేవాదాయ, చిన్న మొత్తాల పొదుపు శాఖ సహాయ మంత్రిగా 1962, మార్చి 19 నుండి 1964, ఫిబ్రవరి 28 వరకు పనిచేశారు. 1964, ఫిబ్రవరి 29 నుండి 1967, మార్చి 6 వరకు శ్రీ బ్రహ్మానంద రెడ్డి మంత్రి వర్గంలో సాంఘిక సంక్షేమ శాఖ సహాయ మంత్రిగా పనిచేసారు.

శ్రీమతి సదాలక్ష్మి 1974-1980 సంవత్సరములలో ఆంధ్రప్రదేశ్ విధాన పరిషత్ సభ్యురాలిగా ఉన్నారు.

వీరు 2004, జులై 24న మరణించారు.

## శ్రీమతి తక్కెళ్ల సదాలక్ష్మి డెప్యూటీ స్పీకరుగా ఎన్నికైన సందర్భంగా చేసిన ప్రసంగం

అధ్యక్షా, ఈ శాసనసభకు నన్ను ఉపాధ్యక్షురాలుగా గౌరవ సభ్యులందరు, ఏకగ్రీవముగ ఎన్నుకున్నందుకు, అభినందిస్తున్నందుకు, మీరు ఆ విషయము గురించి announce చేసి ఆశీర్వదించినందుకు మీకు అందరికి నా కృతజ్ఞత తెలుపుకుంటున్నాను. ఇది నాకు ఎంతో ఉత్సాహకరముగనున్నది. మీలో చాలామంది కంటే నేను చాలా చిన్న వయస్సు గల దానను, మీ అధ్వర్యము క్రింద నేను ఈ ఉపాధ్యక్ష పదవికి సంబంధించి, నా విధులను నేను సక్రమంగా నడిపించగలుగుతానని నా ఆశాభావం. మీ ఆశీర్వాదములన్నీ నాకు ఎంతో బలము, ఉత్సాహము చేకూర్చుతున్నవి. ఇంతవరకు గౌరవ సభ్యులు, మంత్రులతో సహా చాలా మంది నన్ను గురించి మాట్లాడారు. వారు నా ఎన్నికను గురించి హర్షిస్తూ, అభినందించారు. వారి అభినందనలు, మీ ఆశీర్వాదములు నాకు ఉత్సాహము, బలమునిచ్చి ఉపాధ్యక్ష పదవికి ఉంటున్న గురుతర బాధ్యతలను నేను శక్తివంతముగ నెరవేర్చగలనని విశ్వసిస్తున్నాను. నేను బాధ్యతతో నెరవేర్చవలసిన విధులను క్రమబద్ధముగ నెరవేర్చుటకు మీరు అందుకు నాకు చేయూతనిచ్చి, నాకు తోడుగా సహాయపడుతారని ఆశిస్తున్నాను. మొట్టమొదట కాంగ్రెసు లెజిస్లేచర్ పార్టీ మీటింగులోనే నా పేరు ఉపాధ్యక్ష పదవికి ప్రతిపాదించారు. సభ్యులందరూ ఆమోదించి బలపరచారు. అక్కడ పోటీలేకుండా ఎన్నిక అయ్యాను. తిరిగి ఇక్కడ సభలో అన్ని పార్టీలవారు కూడ ఆమోదించి ఎన్నుకున్నారు. అందుకు నాకు చాలా సంతోషముగ నున్నది. నేను చిన్న వయస్సు గల స్త్రీని, ఐనప్పటికినీ మీ అభినందనలన్నీ నేను నాకు ఆశీర్వాదములుగ స్వీకరించుచున్నాను. మీ అందరి సహాయముతో నేను నా బాధ్యతలను సక్రమముగా నెరవేర్చగలనని మీకందరికీ అభయమిస్తూ నేను ఇంతటితో సెలవు తీసుకుంటున్నాను.